క్లుప్తంగా

వాజ్‌పేయీ ఆశయ సాధనకు కృషి



వాజ్‌పేయీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లింగాల హరిగౌడ్ తదితరులు

సైదాబాద్: మాజీ ప్రధాని, దివంగత వాజ్‌పేయీ ఆశయ సాధనకు కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ అన్నారు. వాజ్‌పేయీ వర్ధంతిని బుధవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని కల్యాణ్‌నగర్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హరిగౌడ్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ, వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్న సమయంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మడిగెల లక్ష్మారెడ్డి, ఫణిగౌడ్, నవీన్‌కుమార్, చంద్రకుమార్, వెంకట్‌రెడ్డి, రమేష్, రవి, శివ పాల్గొన్నారు.

సింగిరెడ్డి సేవలు చిరస్మరణీయం



సింగిరెడ్డి శ్రీనివాస రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సైదాబాద్: దివంగత బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి సేవలు చిరస్మరణీయమని సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి అన్నారు. బుధవారం సింగిరెడ్డి శ్రీనివాస రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న సింగిరెడ్డి విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురికి బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. సునీల్ రెడ్డి, సంగీత, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్, శ్రవణ్‌కుమార్, నందు, పాల్గొన్నారు.

బధిరులకు ఉపాధి అవకాశాలు

చాదర్‌ఘాట్: అమెజాన్ ఇండియా, వికలాంగుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బధిరులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆపైన చదువుకున్న 18 నుంచి 35 సంవత్సరాల లోపు బధిరులు అర్హులు. ఆసక్తి, అర్హత గలవారు సంబంధిత ధ్రువపత్రాలతో మలక్‌పేటలోని వికలాంగుల శాఖ కార్యాలయానికి ఈనెల 17న మధ్యాహ్నం 12 నుంచి 2 గంటలలోపు హాజరు కావాలని అధికారులు కోరారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ముందస్తు అరెస్టు

నాగోలు: జీఓ నం 46 ను రద్దు చేయాలని గతంలో మాదిరిగానే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు బుధవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల్లోని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, నియామకాల్లో ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు 53 శాతం రిజర్వేషన్లు కల్పించి, మిగతా జిల్లాలకు 47 శాతం కేటాయించడం వల్ల ఇతర జిల్లాల్లోని అభ్యర్థులకు 130 మార్కులు వచ్చినా ఉద్యోగం దొరికే అవకాశం లేదన్నారు. జీఓ 46 వల్ల గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు అభ్యర్థులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

హుడా సాయినగర్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం

వనస్థలిపురం: నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరికి ఫిట్‌నెస్ అవసరమని, అందుకు కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం హుడా సాయినగర్‌లో హెచ్ఎండీఏ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్ క్లెం నవజీవన్‌రెడ్డి, హెచ్ఎండీఏ పీఓ రమాదేవితో కలసి ఆయన ప్రారంభించారు. నాయకులు బండారి భాస్కర్, పారంద మహేష్, ఉగాది ఎల్లప్ప, గంగాని శ్రీను, సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



కొత్తపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపేట డివిజన్‌లోని వివిధ కాలనీల్లో 4 కోట్ల 80 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పాత మారుతీనగర్ కాలనీ, కొత్తపేట గ్రామంలోని వివిధ ప్రదేశాలలో దెబ్బతిన్న రోడ్లు వేయడం, ఎస్ఆర్ఎల్ కాలనీ రోడ్డు నం.4 నుంచి రోడ్ నెం.12 వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ప్రజయ్ నివాస్ ఫేజ్-1 నుంచి ఆర్‌సీసీ పైపులతో నీటి కాలువ ఏర్పాటు, న్యూనాగోల్ కాలనీలో, కొత్తపేటలోని రాఘవేంద్ర కాలనీ, ఆర్‌బీఐ కాలనీ, సమతాపురి కాలనీ, ఈషా కన్వెన్షన్ వద్ద, కొత్తపేటలోని న్యూ నాగోల్ కాలనీలో, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి సీసీ రోడ్డు వేయడం, కొత్తపేటలోని న్యూనాగోల్ కాలనీ వద్ద రోడ్డు నం.6 నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆర్‌టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌పై సీనియర్ సిటిజన్ల కోసం 2వ అంతస్తు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేశామని, మిగిలిన సమస్యలు కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్‌లోని అన్ని కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే కొత్త పైప్‌లైన్ వేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, సీనియర్ నాయకులు లింగాల నాగేశ్వరరావు, అనంతుల రాజిరెడ్డి, మహేష్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు శ్వేత రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఉదయ్ గౌడ్, విశ్వేశ్వర్‌రావు, శ్రీశైలం గౌడ్, విజయ, బొగ్గరపు వరుణ్, ఇటికల యాదగిరి, దీప్ లాల్, యాదగిరి, నగేష్, పాండు గౌడ్, యాసిన్, జంగీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న శంతన్‌కుమార్, యూనిస్

సైదాబాద్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తమలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ప్రముఖ విద్యావేత్త శంతన్‌కుమార్ అన్నారు. బుధవారం సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మనీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ యూనిస్‌తో కలిసి ఆయన పాఠశాల హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్స్, కెప్టెన్, వైస్ కెప్టెన్‌లుగా నియమితులైన విద్యార్థులను అభినందించారు. వారికి బ్యాడ్జ్‌లు అందజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే మురుగు సమస్య: క్లెం



శారదానగర్‌లో మురుగునీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీలో అధికారుల నిర్లక్ష్యం వల్లే మురుగు సమస్యలు తలెత్తుతున్నాయని కార్పొరేటర్ క్లెం నవజీవన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆయన శారదానగర్‌లో పర్యటించారు. శారదానగర్ కాలనీకి ఎగువన ఉన్న రాజప్పనగర్, భూలక్ష్మీనగర్ తదితర కాలనీల నుంచి మురుగు నీరు భారీగా వచ్చి శారదానగర్ ఫేజ్-3 రోడ్డు నెం.10లో చేరుతుండటంతో కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదన్నారు. తాత్కాలిక పరిష్కారంగా మాన్‌సూన్ సిబ్బందిని రప్పించి మురుగు నీరు దిగువకు వెళ్లేలా మార్గం చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. కాలనీ ప్రధాన కార్యదర్శి కేఎల్ఎస్ రావు, జలమండలి సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారు



కర్మన్‌ఘాట్‌లో అన్నదానం చేస్తున్న కమలాసుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని జయచంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి కమలాసుధీర్ రెడ్డి అన్నారు. అమావాస్య సందర్భంగా కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చంపాపేట ప్రధాన రహదారిలోని కావ్య శానిటేషన్ వ్యాపార సముదాయం ముందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కమలాసుధీర్ రెడ్డి హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. రంగారెడ్డి ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు బిల్ల కంటి కిరణ్ కుమార్ గుప్తా ఈ సందర్భంగా కమలాసుధీర్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆర్యవైశ్యులంతా కలిసి కేక్ కట్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస కాలనీకి చెందిన బొసెట్టి జగదీష్ గుప్తా సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కర్మన్ ఘాట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనంత రవి గుప్తా, ప్రధాన కార్యదర్శి ఆకుల రమాకాంత్ గుప్తా, పద్మా నారాయణ, వీరమల్ల సురేష్, ఆకుల సంతోష్ కుమార్ గుప్తా, సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కుంచారపు రమేష్, మాజీ అధ్యక్షుడు నాగ బండి నగేష్ పాల్గొన్నారు.

శంకేశ్వరబజార్ పాఠశాల స్థలాన్ని పరిరక్షించండి



మలక్‌పేట డీసీ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: శంకేశ్వరబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన స్థలం కబ్జాకు గురికాకుండా పరిరక్షించాలని సైదాబాద్ మండల బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ షేక్ మహమూద్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మలక్‌పేట సర్కిల్-6 డీసీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా షేక్ మహమూద్ మాట్లాడుతూ, పాఠశాల స్థలాన్ని కొందరు గతంలోనూ కబ్జా చేయడానికి యత్నించినప్పుడు తాము అధికారులతో కలిసి అడ్డుకున్నామన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు సంతోషి, పాషా పాల్గొన్నారు.


యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ టోర్నీలో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేసిన దృశ్యం

నాగోలు: యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజిరెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు డివిజన్ జైపురికాలనీలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం రాత్రి నిర్వహించారు. బహుమతుల ప్రదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న రాజిరెడ్డి, సురేందర్ యాదవ్ మాట్లాడుతూ, యువత సమయం వృథా చేయకుండా క్రీడాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాగోల్ డివిజన్ సెక్రెటరీ రమేష్, జైపూరి కాలనీ అధ్యక్షుడు శ్యామల యాదగిరి, బ్లైండ్స్ కాలనీ ప్రెసిడెంట్ ఊరుపక్క రవి, ఆర్గనైజర్ లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాలన్నీ ఏకమైతే రాజ్యాధికారం తథ్యం



మాట్లాడుతున్న డాక్టర్ వినయ్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్: అణగారిన వర్గాలు, వెనుకబడిన వర్గాలు ఏకమైతే రాజ్యాధికారం తప్పకుండా వస్తుందని తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పుంజాల వినయ్ కుమార్ అన్నారు. తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేట బీజేఆర్ భవన్‌లో నిర్వహించిన దళిత సంఘీభావ సభకు వినయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ఆర్ అంబేడ్కర్, మాజీ కేంద్ర మంత్రి, దివంగత పుంజాల శివశంకర్ ఆశయాలను కొనసాగిస్తూ దేశంలో, రాష్ట్రంలో మెజార్టీ జనాభా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలు పాలనలో భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ జానాభాలో 52 శాతం ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి పదవి దక్కడమే సరైన న్యాయమన్నారు. తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త కిన్నెర సిద్దార్థ, నాయకులు నరహరి, భరత్ మాదిగ, రామకృష్ణ, అనికేష్, శ్రీను, పుష్పలత, రాపోలు సురేష్, అనిత, నాగమణి పాల్గొన్నారు.

గౌతంనగర్ కాలనీ నూతన కమిటీ ఏర్పాటు

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ గౌతంనగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా కల్లెం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీహరి, ఎ.జయరాంరెడ్డి, కొమ్ము మధు, ప్రధాన కార్యదర్శిగా జె.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఏ.విక్రమ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా దేవేందర్‌రెడ్డి, కృష్ణయ్య, అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాలకృష్ణగౌడ్, అనంతాచారి, మారుతిలను ఎంపిక చేశారు. అలాగే, కల్చరల్ సెక్రటరీలుగా జగన్‌చారి, రాజిరెడ్డి, రాజేందర్‌గౌడ్, టి.విజయను నియమించారు. ఏడుగురు ఈసీ మెంబర్లు, నలుగురు చీఫ్ అడ్వైజర్లను నియమించారు. రెండేళ్ల పాటు ఈ కమిటీ ఉంటుందని, కాలనీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదకరంగా ఉన్న వీధి దీపాలను మార్చండి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న వీధి దీపాలను తొలగించి, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేటర్ ట్రాన్స్‌కో అధికాలతో కలిసి సైదాబాద్‌లోని ఫిష్‌మార్కెట్, ఎరుకలబస్తీ, హరిజనబస్తీ, త్రీటెంపుల్ చౌరస్తాల వద్ద పర్యటించారు. ఆయా ప్రాంతాలలో శిథిలమైన వీధిదీపాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో స్తంభాల వల్ల ప్రమాదాలు వాటిల్లకుండా అధికారులు అప్రమత్తమవ్వాలని సూచించారు. నూతన వీధి దీపాల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సొహైల్, దినేష్, బన్నీ, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీరాం కాలనీ అభివృద్ధికి కృషి

పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని 19వ వార్డు కౌన్సిలర్ పల్లపు శంకర్ తెలిపారు. వార్డు పరిధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి కృషితో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మధుబన్‌కు వెళ్లే దారిలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ. 25 కోట్లలో.. వార్డుకు రూ. 80 లక్షలు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మారుతీ, శ్రీకాంత్, బాబు, శంకర్, నర్సింహా, రాజు, చందూ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కుమారులతో తల్లి అదృశ్యం



కుమారులతో సరిత

నాగోలు: ఇద్దరు కుమారులతో పాటు తల్లి అదృశ్యమైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్‌బీనగర్ మైత్రినగర్ నివాసి కాంతమ్మ కూతురు సరిత(42)ను కొంత కాలం క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి మృదుల్(12) రితేష్ (12) అనే ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సమస్యల కారణంగా సరిత రెండేళ్లుగా భర్త నుంచి విడిగా ఉంటోంది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోతున్న ఆమె తన కుమారులను తీసుకొని మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లి కాంతమ్మ స్థానికంగా వెతకడంతో పాటు బంధువులను వాకబు చేసినా కుమార్తె, మనవళ్ల ఆచూకీ తెలియరాలేదు. దీంతో కాంతమ్మ ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 1.4 కోట్లతో గౌడ శ్మశాన వాటికలో సౌకర్యాలు



గౌడ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ గౌడ శ్మశాన వాటికలో అధునాత సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల తెలిపారు. మూసారంబాగ్‌లో బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితా అజిత్‌రెడ్డితో కలిసి బుధవారం డివిజన్ పరిధిలో రూ.1.4 కోట్లతో గౌడ శ్మశాన వాటికలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, గడ్డిఅన్నారంలో రూ.8.30 లక్షలతో నిర్మించిన వీడీసీసీ రోడ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, వాటర్ వర్క్స్, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపర్చామన్నారు. అనంతరం ఆరోరా కాలేజ్ సమీపంలోని సమస్యలు పరిశీలించి అవసరమైన పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ పీరసింగ్, డీఈఈ ప్రదీప్‌కుమార్, ఏఈ రవికాంత్, గడ్డిఅన్నారం గౌడ సంక్షేమ సంఘం నేతలు, బీఆర్ఎస్, మజ్లిస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి సన్మానం



స్వాతంత్య్ర సమరయోధుడు వసంత్‌రావు కడ్మికర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మలక్‌పేట:స్వాతంత్య్ర సమరయోధుల పోరాటాలు చిరస్మరణీయమని మూసారంబాగ్ జ్ఞానదీప్ టవర్స్ ప్లాట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. శ్రీనివాస్‌రావు, మాజీ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా..దిల్‌సుఖ్‌నగర్ హనుమాన్ ఆలయంలో స్వాతంత్య్ర సమరయోధుడు వసంత్‌రావు కడ్మికర్(97)ను ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్‌రావు, రవీందర్ మాట్లాడుతూ, అమరుల త్యాగాలు మరువలేనివన్నారు. గాయత్రి భవన్ బుజ్జినాయుడు, రవీందర్, ఆలయ ప్రధాన అర్చకులు అశోక్ జోషి, శ్రీపాద జోషి, ఈఓ సత్యనారాయణ, గోవర్ధన్ పాల్గొన్నారు.

జీఓ 118తో రిజిస్ట్రేషన్ సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న నాగోలు కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యకు జీఓ 118తో శాశ్వత పరిష్కారం లభించిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించినందుకు నాగోల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో సుధీర్ రెడ్డి, కమల దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చొరవ తీసుకుని ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో జీఓ 118 విడుదలై తమ జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, జీఓ 118 వల్ల 15 ఏళ్లుగా దాదాపు 38 కాలనీవాసులు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం కోసం తాను అధికార పార్టీలోకి వెళ్లానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజిరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, నాగోల్ కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు శరత్ రెడ్డి, అంజిరెడ్డి, మల్లేష్, మల్లికార్జునరావు, రామకృష్ణ రెడ్డి, మల్లారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచానికి తగినట్టు విద్యనందించాలి

వనస్థలిపురం: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా నేటి పోటీ ప్రపంచానికి తగినట్టుగా విద్యార్థులకు అవసరమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ రేడియో కాలనీలోని తపస్వి పాఠశాల కొత్త బ్లాక్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల చైర్మన్ ప్రదీప్ కుమార్, మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌గౌడ్, ధర్మేందర్ రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దుతాం



సీసీ రోడ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మలక్‌పేట: డివిజన్‌లోని అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహనగర్ పార్కు సమీపంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కొన్ని ప్రాంతాలలో రోడ్ పనులు నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, సత్తిరెడ్డి, నాయకులు దినేష్, హరి, సంతోష్, కిరణ్, మల్లేష్ పాల్గొన్నారు.

అర్చకులు సమాజానికి మార్గదర్శనం చేయాలి

వనస్థలిపురం: సామాజిక, సామూహిక ఉత్సవాలలో దైవభక్తి, దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించి అర్చక, పురోహితులు సమాజానికి మార్గదర్శనం చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ కోరారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఎల్‌బీనగర్ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలోని లక్ష్మీగణపతి ఆలయంలో అర్చక, పురోహితులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఆలయం కేంద్రంగా హిందూ సమాజాన్ని సంఘటితం చేయడంలో అర్చకులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. పురుషోత్తమాచార్యులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమితి అసెంబ్లీ కో-కన్వీనర్ వెంకన్న, వీహెచ్‌పీ నాయకులు యాదగిరి రావు, నర్సింహా రావు, మంగపతిరావు, లక్ష్మణ్‌రావు, సాయిరాం, సంజయ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్, డీజీఎం

చైతన్యపురి: తరచూ డ్రైనేజీ పొంగిపొర్లడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పటిష్టమైన ప్రణాళికతో సమస్యను పరిష్కరించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని మధురాపురి కాలనీలో జలమండలి డీజీఎం సరిత, ఇతర అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డ్రైనేజీ పైపులు చెత్తాచెదారంతో మూసుకుపోవటం వల్ల మురుగునీరు కాలనీ రోడ్లపై ప్రవహించి స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నిర్లక్ష్యం చేయకుండా సిల్ట్ తొలగించాలన్నారు. జలమండలి సిబ్బంది యాదయ్య నరేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కాలనీవాసులు సత్యనారాయణ, వీకేరావు, అరూప్‌గోష్ తదితరులు పాల్గొన్నారు.